క్లుప్తంగా

ఈటల సమక్షంలో బీజేపీలో చేరిక


పూర్ణకు కండువా కప్పి పార్టీకి ఆహ్వానిస్తున్న ఈటల రాజేందర్

చుంచుపల్లి: కొత్తగూడెం నియోజకవర్గం నుంచి పలువురు నాయకులు బుధవారం హైదరాబాద్‌లో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. కొత్తగూడెం పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారస్తుడు పూర్ణ తన అనుచరులు, మిత్రులతో కలిసి బీజేపీలో చేరారు. వీరికి ఈటల రాజేందర్ బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో తాగునీరు కరువు


తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలు

సుజాతనగర్: మండల కేంద్రంలోని రెండు ప్రధాన ప్రభుత్వ కార్యాలయాల్లో తాగునీటి సౌకర్యం లేదు. వివిధ పనులు నిమిత్తం ఆయా ఆఫీసులకు వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. దీంతో వీటిని పాత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనంలో నిర్వహిస్తున్నారు. పలు ధృవపత్రాలు, భూ సమస్యలు, ఫింఛన్లు, ఆయా ప్రభుత్వ పథకాల కోసం ప్రతి నిత్యం వందలాది మంది కార్యాలయాలకు వచ్చి పోతుంటారు. వీటి సమీపంలో సైతం ఎటువంటి దుకాణాలు లేకపోవడంతో దాహార్తిని తీర్చుకునేందుకు ప్రజలు అవస్థలు పడతున్నారు. కార్యాలయాల్లో కనీసం మిషన్ భగీరథ ట్యాప్ కనెక్షన్ కూడా లేదు. ఇప్పటికైనా అధికారులు ఆలోచించి కార్యాలయాల్లో తాగునీటి వసతి కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బీటీ రోడ్డు నిర్మాణం పూర్తయ్యేదెన్నడో?


నిలిచిపోయిన సాయన్నపేట బీటీ రోడ్డు నిర్మాణ పనులు

టేకులపల్లి: తొమ్మిదోమైలు తండా పరిధిలోని సాయన్నపేట బీటీ రోడ్డు పనులు నిలిచిపోయాయి. దశాబ్దాలుగా గ్రామ ప్రజలు ఎదురు చూస్తున్న ప్రజలకు ఎట్టకేలకు ఎస్టీఎస్‌డీఎఫ్ నిధులు రూ.70 లక్షలతో బీటీ రోడ్డు మంజూరైంది. ఏప్రిల్ 10న ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ రోడ్డు నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. పనులు కూడా ప్రారంభించారు. రోడ్డును తవ్వి కంకర, సిమెంట్ మిక్సింగ్ వేసి లెవలింగ్ చేశారు. ఇక తారు పోయడమే తరువాయి. కానీ ఎందుకో ఆరు నెలల క్రితం రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. కానీ ఎన్నికల పండగ వచ్చినా తిరిగి ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

ఇదేనా పారిశుద్ధ్యం..?


తొమ్మిదోమైలు తండాలో రోడ్డు వెంబడి పేరుకుపోయిన చెత్త

టేకులపల్లి: అధికారులు, పాలకులు పారిశుద్ధ్యం పట్టించుకోవడం లేదు. పరిసరాల పరిశుభ్రత, ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం తడి, పొడి చెత్తను సేకరించి వేరు చేసి వర్మీ కంపోస్టు తయారు చేసేందుకు ప్రభుత్వం డంపింగ్ యార్డులు నిర్మించింది. గ్రామాల్లో చెత్తచెదారం సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాల్సి ఉండగా తొమ్మిదోమైలు తండా పంచాయతీలో రోడ్ల పక్కనే చెత్త అక్కడే దర్శనమిస్తోంది. గ్రామంలో రోడ్డు వెంబడి ఎక్కడ చూసినా చెత్త కుప్పలే కనిపిస్తున్నాయి. అధికారులు స్పందించి చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

బంతి సాగు.. భలే బాగు

- ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతుల ఆసక్తి
- పూలసాగుకు తక్కువ పెట్టుబడి, ఎక్కువ లాభం
- పండుగలు, శుభాకార్యాలకు డిమాండ్


బంతి తోటలో పూలు కోస్తున్న కూలీలు

జూలూరుపాడు: ప్రకృతి వైపరీత్యాల కారణంగా అతివృష్టి, అనావృష్టితో సాగు చేసిన పంటలు దెబ్బతినడంతో రైతన్నలు పీకల్లోతు అప్పుల ఊబిలో కూరుకపోతున్నారు. ప్రతి ఏడాది ఏదో ఒక రకంగా కాలం కలిసి రాక రైతులు పండించిన పంటలు దెబ్బతినడంతోపాటు, కొద్దోగొప్పో పండిన పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, పెట్టుబడులు రెట్టింపు, కూలీల కొరతతో సతమతమవుతున్నారు. దీంతో రైతన్నలు ఆలోచనా విధానం మారింది. పత్తి, మిరప, వరి వంటి ఆహార, వాణిజ్య పంటలు లాభసాటిగా లేకపోవడంతో ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. ముద్దబంతి, కరివేపాకు, బొప్పాయి. మునగ, జామాయిల్, సుబాబుల్, పామ్‌ఆయిల్, మొక్కజొన్న, కూరగాయలు, ఆకుకూరలు వంటి పంటల సాగుపై రైతుల దృష్టి మళ్లింది. దీనికి కారణం తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించడంతోపాటు లాభాలు పొందే అవకాశం ఉంది. దీంతో పత్తి, మిరప వంటి పంటలకు స్వస్తి చెప్పి పంట మార్పిడి విధానాన్ని అవలంబిస్తున్నారు. మండలంలోని జూలూరుపాడు, వెంగన్నపాలెం, కాకర్ల, పడమటనర్సాపురం, వినోభానగర్, దండుమిట్టతండా, భేతాళపాడు, పాపకొల్లు, కొత్తూరు, సాయిరాం తండా, గుండెపుడి, కొమ్ముగూడెం, కరివారిగూడెం, మాచినేనిపేటతండా, మాచినేనిపేట తదితర గ్రామాలకు చెందిన రైతులు ప్రత్యామ్నాయ పంటలను ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు.

పూల సాగుపై ఆసక్తి...

వెంగన్నపాలెం, జూలూరుపాడు తదితర గ్రామాలకు చెందిన రైతులు ముద్ద బంతి పూల సాగు చేస్తున్నారు. బంతి సాగుకు వాతావరణం అనుకూలంగా ఉండటంతోపాటు, తక్కువ కాలంలో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి, లాభసాటిగా ఉండటంతో బంతి సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఒక ఎకరం విస్తీర్ణంలో బంతి సాగుకు చేయడానికి బంతి నారు, నాటు కూలీలకు, ఎరువులకు, కలుపు తీయడానికి అయిన ఖర్చుతో కలిపి మొత్తం సుమారు రూ.50 వేలు పెట్టుబడి అవుతుందని రైతులు చెబుతున్నారు. అక్టోబర్, నవంబరు, డిసెంబర్, జనవరి మాసాలలో బతుకమ్మ, దసరా, దీపావళి పర్వదినాలతోపాటు, అయ్యప్పమాలధారులు, కార్తీక మాసం పూజలు, శుభకార్యాల సీజన్ కావడంతో మార్కెట్‌లో బంతి పూలకు మంచి డిమాండ్ పలకడంతోపాటు, పూలకు ఎప్పుడూ గిరాకీ ఉంటుందని బంతి సాగు చేస్తున్నామని రైతులు అంటున్నారు. ప్రస్తుతం కేజీ పూల ధర రూ.50 నుంచి రూ.60 వరకు ధరల పలుకుతోందని రైతులు చెపుతున్నారు. బతుకమ్మ వేడుకల సమయంలో కేజీ బంతి పూల ధర రూ.80 నుంచి రూ.100 వరకు అమ్మినట్లు చెప్పారు. గత ఏడాది ఇదే సీజన్‌లో కేజీ బంతి పూల ధర రూ.150– 200 వరకు అమ్మడంతో మంచి లాభాలు వచ్చాయన్నారు. కానీ బతుకమ్మ వేడుకలకు బంతి పూలను తక్కువ ధరకు అమ్మడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఉన్న ధర ఉంటే మాత్రం పెట్టుబడి వస్తుందని, లాభాలు ఉండవని రైతులు వాపోతున్నారు. ఈ ఏడాది వరుస తుఫాన్ల కారణంగా బంతి పూలు దెబ్బతిన్నప్పటికీ ధర ఆశాజనకంగా ఉండటంతో మంచి లాభాలు వచ్చాయి. ఈ ఏడాది పంటకు విల్ట్(వైరస్) ఆశించడంతో దిగుబడి తగ్గడంతోపాటు, తక్కువ ధరకు అమ్మాల్సి వస్తుందన్నారు. ఏదైనప్పటికీ ఆశించిన లాభాలు రాకపోయినప్పటికీ నష్టం రాలేదని రైతులు చెబుతున్నారు. మరో నెల రోజుల్లో బంతి పూలక మరింత గిరాకీ ఉంటుందన్నారు. కొత్తగూడెం - తల్లాడ ప్రధాన రహదారి పక్కన బంతి తోటలు ఉండటంతో ప్రయాణికులకు ఆహ్లాదం కలిగిస్తున్నాయి.


బంతి పూలు అమ్ముతున్న మహిళా రైతు

పండుగలకు గిరాకీ ఉంది..



లాభసాటిగా ఉంటుందని బంతి పూల సాగు చేస్తున్నాం. గత ఏడాది కంటే ఈ ఏడాది పూల తక్కువ ధర పలకడంతో లాభాలు రాకపోయినప్పటికీ నష్టం మాత్రం రాలేదు. అర ఎకరం బంతి పూల సాగుకు రూ.30 వేల పెట్టుబడి వచ్చింది. బతుకమ్మ, దసరా పండుగలకు బంతి పూలకు గిరాకీ ఉంది. ఇప్పటి వరకు పెట్టుబడి విచ్చింది. ఇక నుంచి వచ్చేదంతా లాభమే.

– పొరళ్ల రాంబాబు, రైతు వెంగన్నపాలెం

మిర్చి సాగుతో నష్టపోయాం..



ఆరేళ్లుగా బంతి సాగు చేస్తున్నాం. పత్తి పంట సాగు చేస్తే ప్రతి ఏడాది తెగుళ్లు, గిట్టుబాటు ధర లేకపోవడంతో పెట్టుబడి కూడా రావడం లేదు. దీంతో బంతి పూల సాగు చేస్తున్నాం. ఈ ఏడాది ఒక ఎకరం విస్తీర్ణంలో సాగు చేసిన మిర్చికి గుబ్బతెగులు, విల్ట్ రావడంతో తొలగించాం. రూ.లక్ష నష్టం వచ్చింది. మళ్లీ దుక్కి దున్ని వేరే పంట సాగు చేయాలి.

– మార్కాపురి సైదులు, రైతు వెంగన్నపాలెం

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


కొమ్ముగూడెం సబ్‌సెంటర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ లోహిత

ఇల్లెందురూరల్: సీజనల్ వ్యాధుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కొమరారం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ లోహిత సూచించారు. మండలంలోని కొమ్ముగూడెం హెల్త్ సబ్‌సెంటర్‌ను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్‌సెంటర్‌లో పేషెంట్లు, బాలింతలు, గర్భిణులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. సబ్‌సెంటర్ పనివేళల్లో విధిగా సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రస్తుతం జ్వరాల తీవ్రత అధికంగా నమోదవుతోందని, వారికి అవసరమైన మందులు ఎప్పటికప్పుడు అందజేస్తూ వారి ఆరోగ్యం మెరుగుదలకు వ్యక్తిగత శ్రద్ధ చూపాలన్నారు. సబ్‌సెంటర్ల పరిధిలో ప్రైవేటు క్లినిక్‌లలో జరుగుతున్న వైద్యంపై కూడా దృష్టి సారించి ఎప్పటికప్పుడు తమకు సమాచారం అందించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుపయోగంగా బస్ షెల్టర్


టేకులపల్లిలోని బస్ షెల్టర్ ప్రాంగణంలో ఏపుగా పెరిగిన కంపచెట్లు

టేకులపల్లి: ప్రజల సౌకర్యం కోసం నిర్మించిన బస్ షెల్టర్ నిరుపయోగంగా ఉంది. టేకులపల్లి మండలం బేతంపూడి పంచాయతీ వెంకట్యాతండా స్టేజీలో రూ.2 లక్షల వ్యయంతో సుమారు ఏడేళ్ల క్రితం బస్ షెల్టర్ నిర్మించారు. ఆనాటి నుంచి నేటి వరకు దీన్ని ఉపయోగించ లేదు. ఇందులో రాత్రివేళలో అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నాయి. మందుబాబులు అడ్డాగా మార్చుకున్నారు. దీనికి తోడు ఈ షెల్టర్ ముందే మిషన్ భగీరథ గేట్ వాల్వ్ నిర్మించడంతో బస్ షెల్టర్ కనిపించని దుస్థితి ఏర్పడింది. ఉన్నతాధికారులు స్పందించి బస్ షెల్టర్‌ను వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

అనుమతి లేని నిర్మాణాలకు నోటీసులు


యజమానికి నోటీసు అందజేస్తున్న కార్యదర్శులు

చుంచుపల్లి: విద్యానగర్ పంచాయతీలో అనుమతులు లేకుండా నిర్మాణం చేపడుతున్న పలు బహుళ అంతస్తుల యజమానులకు కలెక్టర్, డీపీఓ ఆదేశాల మేరకు బుధవారం పంచాయతీ కార్యదర్శుల బృందం నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో పర్యటించిన కార్యదర్శులు నేరుగా యజమానులకు నోటీసులు అందజేస్తూ పనులను వెంటనే ఆపాలని లేని పక్షంలో కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యదర్శుల బృందంలో బొంతు బాబూరావు, చెన్నకేశవరావు, పాష, రఘు, అమర్, రవి తదితరులు ఉన్నారు.

కార్మికుల మేనిఫెస్టో అమలు చేయండి


హాజరైన సీఐటీయూ సభ్యులు

ఇల్లెందు: తెలంగాణలో ఎన్నికల సందడి మొదలైందని, కార్మికులు మాత్రం అనేక సమస్యలతో సతమతం అవుతున్నారని, కార్మికుల మేనిఫెస్టో అమలు చేసిన వారికే కార్మికులు ఓట్లు వేస్తారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ తెలిపారు. బుధవారం ఇల్లెందులో మండల జనరల్ బాడీ సమావేశం జరిగింది. మాట్లాడుతూ.. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, స్కీం వర్కర్లను పర్మనెంట్ చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ, బీమా సదుపాయం కల్పించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్ కల్పించాలని కోరారు. సమావేశంలో ఎస్ఐ నబీ, తాళ్లూరి కృష్ణ, వెంకటమ్మ, మరియా, ఫాతిమా, కుమారి, శ్రీవల్లి, శారద, సుబద్ర, పార్వతి, సువార్త, దీప్తి, సుశీల, అరుణ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే అంతే..

సుజాతనగర్: ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వాన్ని ఎన్నుకోవడానికి ఎన్నికలే ప్రధాన భూమిక. ఎన్నికల నియమావళిని రూపొందించి పకడ్బందీగా అమలు చేయడానికి ఎన్నికల సంఘం పనిచేస్తుంది. ఎన్నికల నియమావళిని ఎవరు అతిక్రమించినా చట్టం తన పని తాను చేసుకుంటుంది. ఎన్నికల సమయంలో ప్రజాప్రాతినిధ్య చట్టంలోని నిబంధనల ప్రకారం ఎక్కువగా కేసులు నమోదు చేస్తుంటారు. ఈ చట్టంలో అనేక సెక్షన్లు ఉన్నప్పటికీ ఎన్నికల సమయంలో నిబంధనలు అతిక్రమించిన పార్టీలు, వ్యక్తులపైన ఎక్కువగా ప్రయోగిస్తుంటారు. ఆ చట్టాలు ఈవిధంగా ఉంటాయి.

123 ఆర్‌పీ యాక్ట్: లంచగొండితనం, అనుచిత ఒత్తిడి, మతం, జాతి, కులం, సంఘం, లేదా భాషా ప్రాతిపదికపై వర్గాల పౌరుల మధ్య ద్వేషాన్ని, శత్రుత్వాన్ని పెంచితే ఈ చట్టం ప్రకారం శిక్షార్హులు.



125 ఆర్‌పీ యాక్ట్: ఎన్నికల సందర్భంగా వివిద వర్గాల మధ్య శత్రుత్వాన్ని పెంచితే మూడు సంవత్సరాల జైలు శిక్ష, లేదా జరిమానా లేదా రెండూ పడే అవకాశం ఉంది.

125–ఏ ఆర్‌పీ యాక్ట్: తప్పుడు సమాచారం ఇచ్చినందుకు ఆరు నెలల జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండూ అమలు చేయవచ్చు.

కేసీఆర్ హయాంలో అంతటా అభివృద్ధి


ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వనమా

పాల్వంచ: ఏ గ్రామం, పట్టణం చూసినా అడుగడుగునా ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేసిన అభివృద్ధి ఫలాలు కనిపిస్తున్నాయని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. వచ్చే ఎన్నికల్లో తన గెలుపే లక్ష్యంగా వనమా బుధవారం మండలంలోని దంతెలబోర, గంగదేవి గుప్ప, బంద్రుగొండ, సంగం, దంతెలబోర, ఎస్సీ కాలనీ, నారాయణరావుపేట, రేపల్లెవాడ, బోజ్యా తండా, నాగారం తదితర గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో వనమాకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో వనమా మాట్లాడారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశానని, తను జీవించి ఉన్నంతకాలం నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తానన్నారు. ఏ గ్రామంలోనైనా ప్రతీ ఒక్కరికి తనతో ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. నియోజకవర్గంలో ఏ పార్టీ గెలిచినా అభివృద్ధి జరగలేదని, తనతోనే నిరుపేదల సమస్యల పరిష్కారంతో పాటు చిన్నచిన్న సమస్యల మొదలు పలు అభివృద్ధి పనులు చేసినట్లు పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో తనను ఆదరించాలని కోరారు. వచ్చేసారి బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రాగానే షాదీముబారక్, బీసీ బంధు, దళిత బంధు, కల్యాణ లక్ష్మి, ప్రభుత్వం చేపట్టిన ప్రతి పథకం ఇంటింటికీ చేరుస్తామన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ బరపటి వాసుదేవరావు, ఎంపీపీ సరస్వతి, కిలారు నాగేశ్వరరావు, మార్గం గురువయ్య, ఎస్‌వీఆర్‌కే ఆచార్యులు, మండల అధ్యక్షుడు మల్లెల శ్రీరామ్మూర్తి, వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు సంక్షేమం


ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

కొత్తగూడెంరూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పేద ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తారని రాష్ట్ర నాయకులు ఊకంటి గోపాల్‌రావు, ఆళ్లమురళి, తూము చౌదరి అన్నారు. బుధవారం కొత్తగూడెం మున్సిపాలిటీలోని 6, 7 వార్డులలో గడప గడప ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీఆర్‌ఎస్ పాలకులకు బుద్ధి చెప్పే సమయం వచ్చిందన్నారు. రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని దీమా వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ప్రతి నెల రూ.2500, ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, రైతులకు ప్రతి సంవత్సరం రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు, ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇళ్లు లేని వారికి ఇంటి స్థలం ఇస్తామన్నారు. నెలకు రూ.4 వేల పింఛన్, రూ.పది లక్షల ఆరోగ్య బీమా, విద్యార్థులకు ఐదు లక్షల విద్యా భరోసా కార్డు ఇస్తామన్నారు.

కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెక్రటరీ గౌస్, జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ ఖలీల్, సత్యనారాయణరెడ్డి, కనకరాజు, సుందర్ లాల్‌కోరి, రాము, నాగేశ్వరరావు, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

రథయాత్రను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న సురేష్

జూలూరుపాడు: గురువారం జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగ నిర్వహించే రథయాత్రను విజయవంతం చేయాలని సంఘం మండల అధ్యక్షుడు మందా సురేష్ పిలుపునిచ్చారు. బుధవారం జూలూరుపాడులో ఆయన మాట్లాడుతూ.. జనాభా దామాషా ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేయాలని పోరాటం చేస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగ చేపట్టిన రథయాత్ర జిల్లా కేంద్రంలోకి ప్రవేశిస్తున్న సందర్భంగా మండల వ్యాప్తంగా ఉన్న మాదిగలు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. రథయాత్ర జయప్రదం కోసం జూలూరుపాడు, వెంగన్నపాలెం, మాచినేనిపేట, కరివారిగూడెం, పెద్దహరిజనవాడ, పుట్టకోట, పడమటనర్సాపురం, తదితర గ్రామాల్లో ప్రచార దండోరా కార్యక్రమం నిర్వహించి మాదిగలను చైతన్య పరచడం జరిగిందన్నారు. మాదిగ బిడ్డలు, మేధావులు, ఉద్యోగులు, యువత రథయాత్రలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పోతురాజు నాగరాజు, కోటకుమార్ బాబు, మిర్యాల కిరణ్, నల్లగట్ల రాము, తంబర్ల పుల్లారావు, ఇదుపుల సాంబ, నల్లగట్ల జమలయ్య, మందా లక్ష్మణ్, కాకటి సుగుణరావు, పోతురాజు పవన్ పాల్గొన్నారు.

ప్రతి నిరుపేద కుటుంబానికి ఎకరం భూమి


ప్రచారం నిర్వహిస్తున్న కామేష్

సుజాతనగర్: బీఎస్పీ అధికారంలోకి వస్తే భూమిలేని ప్రతి నిరుపేద కుటుంబానికి ఎకరం సాగుభూమి అందజేస్తామని ఆ పార్టీ కొత్తగూడెం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి యెర్రా కామేష్ అన్నారు. మన కొత్తగూడెం–మన కామేష్ కార్యక్రమంలో భాగంగా రాఘవాపురం, మాలబంజర, గొల్లగూడెం గ్రామాల్లో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కామేష్ మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో 24 గంటల వైద్య సేవలు అందకపోవడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. తాను గెలిస్తే 24 గంటల పాటు వైద్యం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. రూ.కోట్ల వ్యయంతో చేపట్టిన సింగభూపాలెం చెరువు పనులు అసంపూర్తిగా మిగిలినా వాటిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆరోపించారు. బీఎస్పీని గెలిపిస్తే వరి పండించే పేద రైతులకు ఉచిత బోరుతో పాటు, రూ.3 వేల మద్దతు ధర, ప్రతీ రైతుకు రూ. రెండు లక్షలు వడ్డీ లేని వ్యవసాయ రుణం, రూ.5 లక్షల వరకు స్వల్ప వడ్డీతో రుణాలు, ధరణి పోర్టల్‌ను రద్దు చేసి పోడు భూములు, అసైన్డ్ భూములకు పట్టాలిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు మార్పు కోరుకోవాలని, ఏనుగు గుర్తుపై ఓటు వేసి బీఎస్పీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గుండేటి ఆదినారాయణ, సిద్ధల నాగేష్, గుండేటి నాగరాజు, మురిపిటి సర్వయ్య, తాళ్లూరి వస్తాజ్, మొరిపెట్టి దుర్గారావు, తరగం రవీందర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

వాయిదా పడనున్న మెడికల్ బోర్డ్

ఆందోళనలో 300 మంది కార్మికులు


సింగరేణి ప్రధానాస్పత్రి ముఖద్వారం

సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణలో నవంబర్ 30న జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల కారణంగా సింగరేణిలో మెడికల్ బోర్డ్ రెండు నెలలు నిలిచిపోనుంది. దీంతో సుమారు 300 మంది కార్మికులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఈ బోర్డులు నెలకు రెండు, మూడు నిర్వహించేవారు. కానీ ఇటీవల ఆ బోర్డ్ నెలకు ఒకటికే పరిమితమైంది. ఆ బోర్డ్ కూడా ఎన్నికల కోడ్ కారణంగా వాయిదా పడనుంది. సింగరేణి సంస్థలో కొంతకాలం పనిచేసి రిటైర్‌మెంట్ దగ్గరలో ఉండి ఇంకా 24 నెలల సర్వీసు ఉన్న కార్మికులకు వారివారి అనారోగ్యాన్ని బట్టి మెడికల్ బోర్డ్ ద్వారా మెడికల్ ఇన్‌వాలిడేషన్ చేసి వారి కుటుంబంలో ఒకరికి బదిలీ వర్కర్‌గా ఉద్యోగ అవకాశాన్ని సంస్థ కల్పించింది.

అయితే తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల దృష్ట్యా ఈనెల 9వ తేదీ నుంచి రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ఉన్నందున ఈ ప్రక్రియ మరో రెండు నెలలు వాయిదా పడనుంది. అయితే గతంలో కరోనా సమయంలో కొంతకాలం వాయిదా పడిన ఈ బోర్డ్‌లో వయోపరిమితిని కోల్పోయిన వందల మంది కార్మికులకు నేటికీ కొంతమందికి ఉద్యోగ అవకాశం లభించ లేదు. ఈ నేపథ్యంలో ఈ రెండు నెలల కాలంలో కూడా కొంతమంది పిల్లల వయోపరిమితి దాటే ప్రమాదముందని వారి సంగతి ఏందని కార్మికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వీరిలో చాలామంది ఉద్యోగాలు దొరకకపోవడంతో ఆయా కటుంబాల ఆర్థిక పరిస్థితి దుర్భరంగా ఉంది. ఎన్నికలు జరగాలి, బోర్డ్ మెడికల్‌కు వారికి పిలుపు వచ్చి అన్‌ఫిట్ అయితే ఫరవాలేదు. కొంత నష్టపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం వస్తుంది. అనుకోకుండా అన్‌ఫిట్ అయితే వారి పరిస్థితి ఏందని కార్మికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మెడికల్ బోర్డ్‌కు పిలిచేనాటి కాలాన్ని పరిగణలోకి తీసుకొని వారికి నష్టం కలగకుండా చూడాలని కార్మికులు కోరుతున్నారు.

మూడునెలల్లో మరో అవకాశం కల్పించాలి...

సింగరేణి కార్పొరేట్ మెడికల్ బోర్డ్‌లో అన్‌ఫిట్ కానీ (మెడికల్ ఇన్‌వాలిడేషన్ కానీ) వారికి బోర్డ్ నిర్వహించిన మూడు నెలల్లో మరో అవకాశం కల్పించి వారి కుటుంబాలను ఆదుకోవాలని కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు. అయితే కంపెనీ వీరికి మరో సంవత్సర కాలం వరకు అవకాశం కల్పించని కారణంగా వారి సర్వీసు లేకుండా పోవటమే కాకుండా సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన వారసత్వ ఉద్యోగానికి చెక్ పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మూడు నెలలకు మరో అవకాశం కల్పించాలి లేదా 24 నెలల సర్వీసు తేదీని ప్రామాణికం చేసి వారి సర్వీసుతో సంబంధం లేకుండా మెడికల్ ఇన్‌వాలిడేషన్‌కు అవకాశం కల్పించాలని కార్మికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇప్పటికి జరిగిన మెడికల్ బోర్డ్ అన్‌ఫిట్ అయిన వారి వివరాలు...

- ఇప్పటి వరకు జరిగిన మెడికల్ బోర్డ్‌లు 104, వీటిలో 20,382 కార్మికులకు బోర్డ్‌కు పిలవగా, 1480 మంది గైరుహాజరయ్యారు.
- 11,992 మంది ఇన్‌వాలిడేషన్ కాగా, 3,331 మంది ఫిట్ ఫర్ సేమ్ జాబ్‌కు ఎంపిక చేశారు.
- 907 మందికి గ్రేడ్ తగ్గించి అండర్ గ్రౌండ్ నుంచి సర్ఫేస్‌కు ఎంపిక చేసింది.
- 2,672 మందిని హయ్యర్ రిఫరల్‌కు పంపించినట్లు సింగరేణి గణాంకాల్లో తెలిపింది.